క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న గ్రామస్తులు

కేశంపేట: మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో నాయకులు పల్లె ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శంకర్ ఆధ్వర్యంలో మండలంతో పాటు గ్రామం అభివృద్ధి సాధించాలని ఈ సందర్భంగా గ్రామస్తులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో పల్లె బాలీశ్వర్, మాజీ సర్పంచ్ రాజు, మల్లేష్‌గౌడ్, శివ, రమేష్, శేఖర్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డి, శ్యాంకుమార్, లక్ష్మమ్మ, భాగ్యమ్మ, ఉమ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు



కనకమామిడి సంగమేశ్వర దేవాలయంలో కార్తీక దీపాల మహిళల సందడి

మొయినాబాద్‌రూరల్: మండలంలోని ఆయా దేవాలయాల్లో సోమవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. మండలంలోని సంగమేశ్వర దేవాలయంతో పాటు స్వామి నారాయణ గురుకుల్ లోటస్ టెంపుల్, హిమాయత్‌నగర్ సోమేశ్వర ఆలయం, ఆయా గ్రామాల్లోని శివాలయాలు కార్తీక దీపాలు మహిళలు పెద్ద ఎత్తున వెలిగించడంలో పాల్గొన్నారు. దీంతో దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పూజారులు భక్తులకు దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

సంబరాలకు దూరంగా..

మొయినాబాద్: చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులది వింత పరిస్థితి. ఓ వైపు ఎమ్మెల్యే అభ్యర్థి ఓడిపోయినందుకు విషాదం వ్యక్తం చేయాలో.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందని ఉత్సాహంతో ఉండాలో కాంగ్రెస్ శ్రేణులు తేల్చుకోలేకపోతుంటే.. మరోవైపు బీఆర్ఎస్ ప్రభుత్వం పోయిందని దుఃఖించాలో.. స్వల్ప మెజార్టీతో ఎమ్మెల్యే గెలిచారని సంతోషపడాలో అర్థం కాని పరిస్థితి బీఆర్ఎస్ కార్యకర్తలది. ఈ పరిస్థితుల్లో ఇటు కాంగ్రెస్ కార్యకర్తలు గాని.. అటు బీఆర్ఎస్ కార్యకర్తలు నియోజకవర్గంలో ఎన్నికల ఫలితాల తరువాత పెద్దగా సంబరాలు జరుపుకోలేదు.

కుంటలో పడి వ్యక్తి మృతి



కావలి కుమార్ మృతదేహం

శంకర్‌పల్లి: మద్యం సేవించిన ఓ వ్యక్తి కుంటలో ఈత కొట్టేందుకు వెళ్లి మృతి చెందిన ఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పర్వేద గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పర్వేద గ్రామానికి చెందిన కావలి కుమార్(30) మధ్యాహ్నం గ్రామ శివారుల్లోని బతుకమ్మ కుంట వద్ద మద్యం సేవించాడు. తర్వాత బతుకమ్మ కుంటలో ఈత కొట్టేందుకు దిగాడు. మద్యం మత్తులో కుంటలో పడి మృతి చెందాడు. మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో విజయఢంకా మోగించడంపై మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు బిస నర్సింహ్మా హర్షం వ్యక్తం చేశారు. సోమవారం హిమాయత్‌నగర్‌లో మండల కాంగ్రెస్ నాయకులు బిస నర్సింహ్మా పలువురికి స్వీట్లు పంచిపెట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అసలైన మెజార్టీ 65 సీట్లతో సాధించడం అభినందనీయమన్నారు. ప్రజలు మార్పుకోరుకున్నారని సూచించారు. పదేళ్ల కుటుంబ పాలనకు చరమగీతం పాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డిని నియమించేందుకు అన్ని సన్నాహాలు జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో హిమాయత్‌నగర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు రాజేందర్, కుమార్, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



స్వీట్లు పంచిపెడుతున్న బిస నర్సింహా



ఎమ్మెల్యే యాదయ్యను కలిసిన నాయకులు



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

చేవెళ్ల గడ్డ యాదన్న అడ్డా

- పార్టీ శ్రేణులకు ప్రత్యేక కృతజ్ఞతలు
- బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్త మాణిక్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య హ్యాట్రిక్ విజయంపై బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్త మాణిక్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సోమవారం కాలె యాదయ్య మూడోసారి విజయం సాధించి మొదటిసారిగా అజీజ్‌నగర్‌కు రావడంతో ఆయనకు అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవియాదవ్, అజీజ్‌నగర్ సర్పంచ్ సంధ్య శ్రీశైలం తదితరులు ఘనస్వాగతం పలికి సన్మానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కాలె యాదయ్య అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సందర్భంగా మాణిక్‌రెడ్డి మాట్లాడుతూ.. చేవెళ్ల ఎమ్మెల్యేగా మూడోసారి యాదయ్య గెలుపు మనందరి కృషి అని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మత్స్యకార్మిక సంఘం జిల్లా చైర్మన్ వెంకటాపూర్ బాలరాజ్, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి మరింత కృషి చేస్తా

శంకర్‌పల్లి: చేవెళ్ల నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. సోమవారం ఆయన నివాసంలో శంకర్‌పల్లి మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాన్నారు. తనకు మూడోసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించిన ప్రజలకు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పాపారావు, వైస్ చైర్మన్ వెంకటేశ్, సర్పంచ్‌లు రవీందర్‌గౌడ్, శ్రీనివాస్, సత్యనారాయణ రెడ్డి, నాయకులు సాత ప్రవీణ్‌కుమార్, గోపాల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, ఫరీద్, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన గ్రామస్తులు

షాబాద్: మండలంలోని సర్దార్‌నగర్, రుద్రారం, హైతాబాద్, సీతారాంపూర్ గ్రామస్తులు సోమవారం నవాబుపేట్ మండలం చించల్‌పేట్‌లో ఎమ్మెల్యే కాలె యాదయ్య నివాసంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వెనుకబడిన షాబాద్ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహులు, రాఘవేందర్, గ్రామస్తులు తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో మహా పడిపూజ



మహాపడి పూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

మొయినాబాద్‌రూరల్: అయ్యప్పస్వామి 18వ మహాపడి పూజను పల్లె భాస్కర్‌రెడ్డి ఘనంగా నిర్వహించారు. సోమవారం మండల పరిధిలోని కనకమామిడి అయ్యప్ప సన్నిధిలో పల్లె సుశీల, మోహన్‌రెడ్డిల ఆధ్వర్యంలో నారికెళ్ల గురుస్వామి పల్లె భాస్కర్‌రెడ్డి మహాపడి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వాములు క్రిషన్ గురుస్వామి, ఉమాశంకర్‌రెడ్డి, రాంచందర్‌గురుస్వాములు పూజలు చేశారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామికి పూలు, పండ్లు, నూతన వస్త్రాలు సమర్పించి మహామంగళ హారతిని సమర్పించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు, భజన మండలి బృందం రాజు అలపించిన అయ్యప్పస్వామి భక్తిగీతాలు అందరిని ఆకట్టుకున్నాయి. అయ్యప్ప స్వామి నామస్మరణతో గ్రామం మారుమోగింది. ఈ పూజల్లో వివిధ గ్రామాల ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

పట్నంలో కాంగ్రెస్ హవా

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం స్థానం నుంచి పోటీ చేసిన అభ్యర్థుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మినహా అభ్యర్థులందరి డిపాజిట్లు గల్లంతయ్యాయి. ఈ నియోజకవర్గం నుంచి 28 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలబడ్డారు. కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డికి 1,26,506 ఓట్లు రాగా.. ఆయన మీప ప్రత్యర్థి బీఆర్ఎస్ అభ్యర్థి కిషన్‌రెడ్డికి 89,806 ఓట్లు పోలయ్యాయి. రంగారెడ్డి 36,700 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

బీజేపీకి తగ్గిన ఓట్లు

ప్రధాని మోదీ ప్రభావం, బీసీ ముఖ్యమంత్రి నినాదం నియోజకవర్గంలో పనిచేయలేదు. 2018 ఎన్నికల్లో బీజేపీకి 17 వేలు ఓట్లు పడ్డాయి. ఈ సారి ఆ పార్టీ అభ్యర్థి నోముల దయానంద్‌గౌడ్‌కు 15,790 ఓట్లు మాత్రమే రాబట్టారు. గత ఎన్నికలతో పోల్చితే ఈ ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గింది.

ప్రభావం చూపని సీపీఎం

సీపీఎం అభ్యర్థి పగడాల యాదయ్యకు 3,948 ఓట్లు మాత్రమే పడ్డాయి. 2018 ఎన్నికల్లో 9 వేలకు పైగా ఓట్లు సాధించిన ఆ పార్టీ.. ఈ సారి మరింత దిగజారిపోవడంతో విశ్లేషకులనుఆశ్చర్యానికి గురిచేసింది.

బీఎస్పీ విఫలం

బీఎస్పీ అసలు ప్రభావం చూపలేదు. 2,114 ఓట్లకే ఆ పార్టీ పరిమితమయింది. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పార్టీ పగ్గాలు చేపట్టిన అనంతరం బీఎస్పీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని అందరూ భావించారు.

సీఐ, ఎస్ఐపై చర్యలు తీసుకోండి

ఇబ్రహీంపట్నం: తమ నాయకుడిపై చేయి చేసుకున్న సీఐ, ఎస్ఐపై చర్యల తీసుకోవాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ఇబ్రహీంపట్నంలో ర్యాలీగా వెళ్లి.. అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రచారి, నర్సింహా, నియోజకవర్గ ఇన్‌చార్జి యాదిరెడ్డి మాట్లాడుతూ.. ఆర్డీఓ కార్యాలయంలో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పోస్టల్ బ్యాలెట్ బ్యాక్స్‌లు తెరిచారని కాంగ్రెస్, సీపీఐ శనివారం నిరసన తెలుపుతుంటే.. స్థానిక సీఐ గోవింద్‌రెడ్డి, ఎస్ఐ నాగరాజు అకారణంగా తమ పార్టీకి చెందిన కృష్ణపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని మండిపడ్డారు. పోలీస్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు హరిసింగ్‌నాయక్, లక్ష్మణ్, లక్ష్మయ్య, శ్రీశైలం, నర్సింహా, యాదయ్య, శ్రీహరి పాల్గొన్నారు.

ప్రజా తీర్పును శిరసావహిస్తా

- పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: ఎన్నికల్లో ప్రజాతీర్పును శిరసావహిస్తానని పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్, ఆల్ ఇండియా ఫార్వర్డు బ్లాక్ అభ్యర్థి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, పోటీలో ఎవరో ఒకరు మాత్రమే గెలుస్తారని అన్నారు. రాజకీయాలు అనేవి కేవలం ఎన్నికల వరకు మాత్రమే పరిమితం కావాలన్నారు. అక్రమ కేసులు, దౌర్జన్యాలు, భూకబ్జాలు లాంటి వాటికి నేతలు దూరంగా ఉండాలని సూచించారు. బీజేపీ నుంచి టికెట్ ఆశించినా లభించకపోవడంతో ఆల్ ఇండియా ఫార్వర్డు బ్లాక్ పార్టీ నుంచి పోటీ చేయాల్సి వచ్చిందని తెలిపారు. కేవలం 13 రోజుల్లో గుర్తును ప్రజల్లోకి తీసుకెళ్లి 32వేల ఓట్లు సాధించి నైతికంగా తానే విజయం సాధించానని వెల్లడించారు. అయితే బీఆర్ఎస్‌కు మద్దతు తెలపాలని సీఎం కేసీఆర్ ఎమ్మెల్యేతో సంప్రదించారని తెలిపారు. తనకు వచ్చిన ఓట్ల వల్ల బీఆర్ఎస్ అభ్యర్థి అంజయ్య యాదవ్‌కే నష్టం జరిగిందన్నారు. తనకు ఓట్లు వేసిన వారికి జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు. రాబోయే కాలంలో సేవలను మరింత విస్తృతం చేస్తానని మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో సేవా కార్యక్రమాలు చేపడుతానని వివరించారు. సమావేశంలో నాయకులు మోహన్‌సింగ్, నర్సింహ్మా యాదవ్, ఆకుల ప్రదీప్, ఇస్నాతి శ్రీనివాస్, శ్యాంసుందర్‌రెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు అండగా కేశంపేట

కేశంపేట: అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కేశంపేట మండలం కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచింది. మండలంలోని 29 గ్రామాల పరిధిలో 43 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అదివారం వెలువడిన ఫలితాల్లో మండలంలో బీఆర్ఎస్ అభ్యర్థి అంజయ్యయాదవ్‌కు ఎక్లాస్‌ఖాన్‌పేట (479), పోమాల్‌పల్లి (44), చింతకుంటపల్లి (106), లేమామిడి (173), సంతాపూర్(67), కొనాయపల్లి (30), దత్తాయపల్లి (11) ఓట్లు వచ్చాయి. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్‌కు పాపిరెడ్డిగూడ (158), ఇప్పలపల్లి (168), దేవునిగుడితండా (05), కొండారెడ్డిపల్లి (60), కేశంపేట (183), బైర్కాన్‌పల్లి (114), కాకునూర్ (34), తొమ్మిదిరేకుల (139), లింగంధన (25), నిర్ధవెల్లి (118), బోధునంపల్లి (23), చౌలపల్లి (405), వేములనర్వ (77), అల్వాల (95), పాటిగడ్డ (122), మంగళిగూడ (66), కొత్తపేట (207) ఓట్లు వచ్చాయి. నిర్ధవెల్లి, బోధునంపల్లి గ్రామాల్లో అధికార బీఆర్ఎస్ పార్టీ మూడవ స్థానంకే పరిమితమైంది. ఈ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డిల మధ్యనే పోటీ జరిగింది. మండలంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ 5271 ఓట్లను సాధించగా, బీజేపీ 1408 ఓట్లను మాత్రమే సాధించింది. కాంగ్రెస్ పార్టీకి 12,469, బీఆర్ఎస్ పార్టీకి 11,247 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్‌కు 304, కాంగ్రెస్‌కు 870, బీజేపీకి 86, ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి 225 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదయ్యాయి.

బీజేపీకి పెరిగిన ఆదరణ



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

చేవెళ్ల: అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటు బ్యాంక్ ఘననీయంగా పెరిగిందని ఆ పార్టీ నాయకుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలలో రాష్ట్ర వ్యాప్తంగా పోటీ చేసిన ప్రతి చోట బీజేపీ అభ్యర్థులకు కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు పోటీగా ఓట్లు వచ్చాయన్నారు. గతంలో ఒక్కటి రెండు సీట్లు గెలిస్తే ఇప్పుడు ఏకంగా ఎనిమిది సీట్లు గెలిచిందన్నారు. దేశంలో ప్రజలు మోదీపాలనను ఆదరిస్తున్నారని తెలంగాణలో కూడా ఇప్పుడిప్పుడే మార్పు వస్తుందని తెలిపారు. చేవెళ్లలో కూడా బీజేపీకి పెద్ద ఎత్తున ప్రజలు ఆదరణ చూపించారని వివరించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బీజేపీ ఓటు బ్యాంకు పెరిగిందన్నారు. ప్రజలు ఆశీర్వాదంతో దాదాపు 38వేల ఓట్లు బీజేపీకి వచ్చాయన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌కు జై కొట్టిన కొత్తూరు ఓటర్లు

- అధికార పార్టీకి దక్కని మద్దతు



ఓటు వేయడానికి క్యూలో ఉన్న ఓటర్లు(ఫైల్)

కొత్తూరు: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తూరు మున్సిపాలిటీతో పాటు మండల ఓటర్లు కాంగ్రెస్ పార్టీకే జై కొట్టారు. అధికార బీఆర్ఎస్ పార్టీ కంటే కాంగ్రెస్‌కే తమ మద్దతు అని ఓటు ద్వారా తెలిపారు. మరోమారు కొత్తూరు మండలం, మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీకు కంచుకోట అని నిరూపించారు. వాస్తవంగా మండలం, మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ నాయకుల కంటే ఎక్కువగా బీఆర్ఎస్ నాయకులే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఓటరును కలిసి ప్రభుత్వ పథకాలు, స్థానికంగా జరిగిన అభివృద్ధిని వివరించారు. అయినప్పటికీ ఎన్నికల్లో అనుకున్న ఫలితాలను రాబట్టుకోలేకపోయారు. మండలం, మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన 27 పోలింగ్ బూత్‌ల్లో కేవలం మున్సిపాలిటీలోని తిమ్మాపూర్ 25, 26 బూత్‌ల్లో మాత్రమే బీఆర్ఎస్ 83 ఓట్ల మెజార్టీ సాధించింది. మిగిలిన 26 బూతుల్లో కాంగ్రెస్ పార్టీ అధికార పార్టీపై ఆధిక్యత కొనసాగించింది. మొత్తంగా మండలం, మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకు 1410 ఓట్ల మెజార్టీ వచ్చాయి.

సోనియా రుణం తీర్చుకున్న ప్రజలు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మర్పల్లి: తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణాన్ని ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించి తీర్చుకున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, మార్కెట్ వైస్ చైర్మన్ రామేశ్వర్‌లు అన్నారు. సోమవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో వికారాబాద్ సెగ్మెంట్ బరిలో నిలిచిన పార్టీ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించడం అభినందించదగ్గ విషయమని చెప్పారు. ప్రభుత్వ ఏర్పాటు అనంతరం.. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బీసీసెల్ మండల అధ్యక్షుడు సర్వేశ్, మాజీ సర్పంచ్‌లు సుభాష్‌యాదవ్, పాండునాయక్, మాజీ ఉప సర్పంచ్‌లు జాఫర్, రాములు, సీనియర్ నాయకులు రాములు, దివాకర్, శ్రీనివాగుప్తా, రాచన్న, మల్లేశ్‌యాదవ్, ప్రభాకర్‌రెడ్డి, సుదర్శన్, జనార్దన్‌రెడ్డి, పంతులుబాయి శ్రీనివాస్, నారాయన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కూలీల కరువు.. పత్తితీత బరువు

విత్తు విత్తింది మొదలు దిగుబడి చేతికి వచ్చేవరకు నిత్యం రైతులకు సవాళ్లు ఎదురవుతున్నాయి. తెగుళ్లు, వానాలు రాక పంటలు ఎండిపోవడం, పంట చేతికొచ్చిన తర్వాత మద్దతు ధర రాక అనేక ఇబ్బందులు పడుతుంటారు. ఇవన్నీ ఒకటైతే కూలీల కొరత పెద్ద సమస్య. కొంత కాలంగా కూలీలు దొరకక రైతులు తిప్పలు పడాల్సి వస్తోంది.

- ఇతర ప్రాంతాల నుంచి తీసుకొస్తున్న రైతులు
- పెరిగిన కూలీ ధరలు.. భారంగా మారిన వైనం



కూలీలు దొరకక చేనుపైనే పత్తి

దౌల్తాబాద్: పంట చేతికొచ్చిన సమయంలో కూలీలు దొరకక పత్తి రైతులు సతమతమవుతున్నారు. మొక్కజొన్న, తెల్ల బంగారం ఒకేసారి కోతకు రావడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకురావాలంటే వ్యయ భారం అధికమవుతోందని రైతులు పేర్కొంటున్నారు. ఇందులో పెద్ద రైతులు పోటీపడుతుండటంతో చిన్న, సన్నకారు రైతులకు అంత సొమ్ము చెల్లించే స్థోమత లేక.. ఆందోళనకు గురవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో కొనుగోళ్లు సైతం ఊపందుకోగా.. ఇక్కడ మాత్రం పంట చేలల్లో మగ్గుతోందని ఆవేదన చెందుతున్నారు.

క్వింటాకు రూ.1200

ఏడాది క్రితం వరకు కిలో పత్తి తీతకు రూ.9 కూలీ ఉండగా.. ప్రస్తుతం అది 12కు చేరి, క్వింటాకు రూ.1100–1200 వరకు కూలీ చెల్లించాల్సి వస్తోందని పలువురు రైతులు చెప్పారు. అంతే కాకుండా ఏరిన తరువాత ఇంటికి తరలించేందుకు ఇతర ప్రాంతాల కూలీలకు అదనంగా డబ్బులు ఇవ్వాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ లెక్కన ఎకరా పొలంలో ఎనిమిది నుంచి 10 క్వింటాళ్ల పత్తి పండితే.. దానికి సుమారు రూ.12వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. సాగు సమయంలో ఎరువులు, పురుగు మందులకు అయ్యే వ్యయంతో పాటు పత్తి ఏరేందుకు అయ్యే మొత్తంతో కలిపితే.. ఖర్చు అమాంతం పెరిగి, ఆదాయంపై ప్రభావం పడుతోందని రైతులు చెప్పారు.

యంత్రాలు ఎప్పుడొస్తాయో?

సాగులో యాంత్రీకరణ పెరుగుతున్న దశలో.. పత్తిని పొలం లోంచి తీసే యంత్రం అందుబాటులోకి రాలేదు. కొంత కాలంగా వ్యవసాయ అధికారులు పత్తిని తీసే యంత్రం వచ్చిందని, ముందు డెమో చేసి చూపిస్తామని చెబుతున్నారే తప్పా.. కార్యరూపం దాల్చడానికి ఎటువంటి చర్యలు తీసుకోవడం రైతులు ఆరోపిస్తున్నారు. అయితే యంత్రం వస్తుందని, కానీ దాన్ని ఉపయోగిస్తే సమస్యలు వస్తాయని వారే చెప్పినట్లు రైతులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా.. పత్తి తీతకు యంత్రాలు లేక, కూలీల కోరతో పంట చేలోనే నేల రాలుతుందని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

మోమిన్‌పేట: అయ్యప్ప కాటన్ ట్రేడర్‌లో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభించామని మర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దిగుబడిని తీసుకు వచ్చే ముందు.. ఆధార్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకం, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్సు కాపీలను రైతులు తమవెంట తీసుకురావాలని సూచించారు. బ్యాంకు ఖాతాకు ఆధార్, ఫోన్ నంబరు అనుసంధానమై ఉండాలని చెప్పారు. ఎకరాకు 12క్వింటాళ్లు మాత్రమే తీసుకుంటామని, క్వింటా పత్తికి రూ.7,020లుగా మద్దతు ధర ఉందని వెల్లడించారు. పత్తిలో తేమ 8శాతం కంటే.. ఎక్కువగా ఉంటే ధరలో వ్యత్యాసం ఉంటుందని, గరిష్టంగా 12శాతం వరకు కొనుగోలు చేయబడుతుందని స్పష్టం చేశారు. అయితే 8శాతం నుంచి ఒక్కో శాతం పెరిగిన కొద్దీ రూ.70లు తగ్గుతుందని, ఇది రైతులు గమనించాలని కోరారు.



తేమ శాతం పరిశీలిస్తున్న సీసీఐ అధికారులు

రేవంత్‌కు శుభాకాంక్షలు

తలకొండపల్లి: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు మహేశ్ శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం మండల పరిధిలోని చీపునుంతల్లో ఆయన మాట్లాడారు. పార్టీని గెలిపించేందుకు రేవంత్ రాష్ట్రవ్యాప్తంగా తిరిగి అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేశారని కొనియాడారు. ఆయన ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారని గుర్తుచేశారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

తలకొండపల్లి: తాటి చెట్టు పైనుంచి పడిన గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండల పరిధిలోని జంగారెడ్డిపల్లికి చెందిన రఘురాములుగౌడ్ ఆదివారం సాయంత్రం తాటి చెట్టు నుంచి కల్లు గీస్తుండగా కాలు జారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన రఘురాములుగౌడ్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకుంటోంది

కమలానికి జైకొట్టిన తుక్కుగూడ

తుక్కుగూడ: అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఆదివారం ఓట్ల లెక్కింపులో మంత్రి సబితారెడ్డి మరోసారి విజయం సాధించారు. ఆమెకు నియోజకవర్గ వ్యాప్తంగా ఆధిక్యం కనబరిచినా.. తుక్కుగూడ మున్సిపాలిటీ వాసులు బీజేపీకి లీడ్ ఇచ్చారు. బూత్ నెంబర్ 387 నుంచి 407వరకు బీజేపీకి 6,917, బీఆర్ఎస్‌కు 5,382, కాంగ్రెస్‌కు 2,770 ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ కమలం అభ్యర్థి అందెల శ్రీనివాస్ 1,459 ఓట్ల ఆధిక్యతను కనబరిచారు.